క్లుప్తంగా

శ్రీవారిని దర్శించుకున్న ఎస్పీ కిషోర్ దంపతులు



ఎస్పీ నరసింహ కిషోర్, లావణ్య దంపతులకు వేదాశీర్వాదం ఇస్తున్న అర్చకులు

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారిని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్, లావణ్య దంపతులు శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. స్వామి వారు, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్పీ నరసింహకిషోర్ దంపతులకు ఆలయ ప్రధానార్చకులు దుర్గాప్రసాద్ ఆచార్యులు, కేశవాచార్యులు, కార్తీక్ ఆచార్యులు వేదాశీర్వాదం ఇచ్చారు. ద్వారకాతిరుమలలో శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో దేవరపల్లి శ్రీవారిని దర్శించుకున్నారు.

శ్రీవారి ఆలయానికి పూజాసామగ్రి అందజేత



ఆలయానికి వెండి పళ్లెం అందజేస్తున్న మండ శ్రీనివాసరావు దంపతులు

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర సామి వారి ఆలయానికి దాతలు శనివారం పూజాసామగ్రి అందజేశారు. కొయ్యలగూడెంకు చెందిన మండ శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులు రూ.50 వేల విలువైన వెండి పళ్లెం సమర్పించారు. అలాగే గ్రామానికి చెందిన సుతాపల్లి గోపాలకృష్ణ కుమారులు వెంకటరామారావు, సత్యానందం శ్రీవారికి ఇత్తడి అభిషేక పళ్లెం, నక్షత్ర హారతి, గంట సమర్పించారు. సామగ్రిని దాతలు ఆలయ నిర్వాహకులు, అర్చకులకు అందజేశారు.

అన్నవరప్పాడులో భక్తుల రద్దీ



వేంకటేశ్వరస్వామి స్వామి, అమ్మవార్లు

పెరవలి: అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వర స్వామి దర్శనానికి శనివారం వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. స్వామి వారి దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ చర్యలు తీసుకుంది. వందలాది మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. దాతల ఆర్థిక సహాయంతో సుమారు 4 వేల మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రతి శనివారం భక్తులకు అన్న సమారాధన నిర్వహిస్తున్నామని చెప్పారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోండి

తాళ్లపూడి: త్వరలో నిర్వహించే పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల నమోదు జరుగుతోందని, గ్రాడ్యుయేట్లు అందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కార్యాలయ ఏఎస్వో జె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఓటరు నమోదు దరఖాస్తులను శనివారం తాళ్లపూడిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021 నాటికి డిగ్రీ ఉత్తీర్ణులైన వారందరూ ఓటరుగా నమోదుకు అర్హులన్నారు. కార్యక్రమంలో తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ, కానిస్టేబుళ్లు, గ్రామీణ ఉపాధి పథకం ఏపీవో రమాదేవి, తాళ్లపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి హరికాగుప్త, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల సందర్శించిన న్యాయమూర్తి



దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి నాగలక్ష్మి

దేవరపల్లి: మండలంలోని గొల్లగూడెం వద్ద గల దివ్యాంగుల ఆశ్రమ పాఠశాల్లోని బాలుర, బాలికల వసతి గృహాలను, వృద్ధుల ఆశ్రమాన్ని, గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్రంలోని వృద్ధాశ్రమాన్ని కొవ్వూరు రెండో అదనపు మేజిస్ట్రేట్ ఎ.నాగలక్ష్మి శనివారం సాయంత్రం పరిశీలించారు. హాస్టల్లోని విద్యార్థుల సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. భోజనం నాణ్యత, పరిశుభ్రత, వసతి సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లోని మౌలిక వసతుల గురించి అడిగారు. వృద్ధులతో మాట్లాడారు. వసతిత, భోజన సదుపాయం గురించి అడిగి తెలుసుకున్నారు. అన్ని వసతులు ఉన్నాయని విద్యార్థులు, వృద్ధులు చెప్పడంతో మెజిస్ట్రేట్ నాగలక్ష్మి సంతృప్తి వ్యక్తం చేశారు. గౌరీపట్నం వృద్ధాశ్రమం నిర్వహణ పట్ల కూడా ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల ఆశ్రమం వ్యవస్థాపక చైర్మన్ కాగిత భాస్కరరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

పారిశుధ్య లోపం.. పౌరులకు శాపం

- పేరుకుపోతున్న వ్యర్థాలు, రోడ్లపైకి చేరుతున్న మురుగు
- మూలకు చేరిన చెత్త సేకరించే ఈ-ఆటోలు
- తడి, పొడి చెత్త సేకరణకు మంగళం
- ఇదీ నిడదవోలు మున్సిపాలిటీలో పరిస్థితి



మూలకు చేరిన ఈ- ఆటోలు



పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్‌లో పేరుకు పోయిన వ్యర్థాలు



చెత్త సేకరణ ట్రాక్టర్ బాడీకి పడిన రంధ్రంపై అడ్డుపెట్టిన చెక్క బల్ల

నిడదవోలు: పేరుకే గ్రేడ్- 2 మున్సిపాలిటీ.. అంతకు మించి నిడదవోలు నియోజకవర్గానికి ప్రధాన కేంద్రం.. అన్నింటికీ మించి రాష్ట్ర మంత్రివర్గంలో మూడు శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కందుల దుర్గేష్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం.. ఇవన్నీ చెప్పుకోవడానికి బాగానే ఉన్నా.. ఇక్కడ పాలన మాత్రం పడకేసింది. నిడదవోలు మునిసిపాలిటీ పరిధిలోని డ్రెయిన్లలో వ్యర్థాలు చేరి దుర్గంధం వ్యాపిస్తోంది. రహదారులపై మురుగు చేరుతోంది. దుమ్ము, ధూళితో పాటు చీమల పుట్టలను తలపించేలా దోమలు బాగా పెరిగిపోయాయి. ఫలితంగా పౌరులు రోగాల బారిన పడుతున్నారు. పందులు, కుక్కల సంచారంతో ఎక్కువై, పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. పట్టణ రోడ్లపై బైక్‌పై వెళితే చాలు కళ్లు, తల చుట్టూ దుమ్ముతో నిండుతోంది.

బదిలీపై కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు పట్టణంపై ఇంకా పూర్తిగా అవగాహన రాలేదనే విమర్శలు వస్తున్నాయి. మరో పక్క మునిసిపల్ అధికారులు, పారిశుధ్య కార్మికుల మధ్య సమన్వయం లోపించింది. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మునిసిపల్ చైర్మన్, కౌన్సిలర్ల మధ్య సఖ్యత లోపించిందని, ఫలితంగా పాలన కుంటుపడుతోందనే విమర్శలు వస్తున్నాయి. కొత్తగా శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా వచ్చిన వ్యక్తికి 18 రోజులైనా ఇంతవరకూ పట్టణ పారిశుధ్య నిర్వహణపై అవగాహన అంతంత మాత్రమే అని పలువురు అంటున్నారు.

వాహనాల వినియోగంలో నిర్లక్ష్యం

స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గతేడాది నిడదవోలు మునిసిపాలిటీకి రూ.36 లక్షల విలువైన ఆరు ఈ–ఆటోలు సమకూరాయి. అప్పట్లో వాటిని ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణకు వినియోగించారు. రాను రానూ ఆ వాహనాల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహించడంతో కూటమి ప్రభుత్వంలో అవి మూలన పడ్డాయి. బ్యాటరీలు పాడైపోయి, సాంకేతిక లోపంతో పని చేయకుండా పోయాయి. అధికారులు కూడా వాటికి మరమ్మతులు చేపట్టకుండా వృథాగా వదిలేశారు. రూ. లక్షలు విలువైన వాహనాలు నిరుపయోగంగా ఉన్నాయని ప్రజలు తప్పు పడుతున్నారు. ప్రస్తుతం చెత్త సేకరణకు వినియోగిస్తున్న మూడు ట్రాక్టర్లు పాడైపోయాయి. ట్రాక్టర్ల బాడీకి పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. చెక్కలను అడ్డుగా పెట్టి పారిశుధ్య సిబ్బంది పని కానిస్తున్నారు.

చెత్త సేకరణకు విఘాతం

ఈ –ఆటోలు మూలన పడడంతో ఇంటింటా తడి, పొడి సేకరణకు అధికారులు మంగళం పాడారు. కొత్తలో వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి తడి,పొడి చెత్తను విజయవంతంగా సేకరించారు. కూటమి ప్రభుత్వం రాగానే వాటిని పక్కన పెట్టేశారు. బ్యాటరీలు పనిచేయని ఈ ఆటోలకు కనీసం మరమ్మతులు చేయించేందుకు కూడా అధికారులు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం చెత్త సేకరణకు మూడు ట్రాక్టర్లు, రెండు కంప్రెసర్లు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం 28 మంది రెగ్యులర్ పారిశుధ్య కార్మికులు, 92 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులు పని చేస్తున్నారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరగాలంటే కనీసం మరో 50 మంది కార్మికుల అవసరమని అధికారులు చెబుతున్నారు. సుమారు 48 వేల జనాభా ఉన్న నిడదవోలు పట్టణం నుంచి రోజూ 36 మెట్రిక్ టన్నుల చెత్త సేకరించాలి. ఆశించిన స్థాయిలో చెత్త సేకరణ జరగడం లేదు.

30 డస్ట్ బిన్‌లు ఏర్పాటు చేస్తాం



పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రస్తుతం ఉన్న కార్మికులు సరిపోవడం లేదు. అదనంగా 50 మంది కార్మికులు అవసరం అవుతారు. పట్టణంలోని ప్రధాన సెంటర్లలో 30 డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాం. పట్టణంలో వ్యర్థాల సేకరణకు మరో ట్రాక్టర్ అవసరం అవుతుంది. నిరుపయోగంగా ఉన్న ఈ –ఆటోలను మరమ్మతులు చేయాలని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లాం. చెత్త సేకరణలో నెలకొన్న పరిస్థితులపై అవగాహన చేసుకొని ముందుకు పోతున్నాం. వర్షాలు తగ్గిన తర్వాత దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేపడతాం.

– పీవీ రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నిడదవోలు మునిసిపాలిటీ

పుర వీధుల్లో సౌభాగ్య దుర్గాంబిక ఊరేగింపు



దేవరపల్లి వీధుల్లో ఊరేగుతున్న సౌభాగ్య దుర్గాంబికా దేవి



దుర్గాంబికా దేవి

దేవరపల్లి: దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు ముగియడంతో దేవరపల్లి మూడు బొమ్మల సెంటర్లోని సౌభాగ్య దుర్గాంబికా దేవి ఆలయం వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని శనివారం గ్రామ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. ప్రత్యేకంగా వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన వాహనంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ఊరేగించారు. వాహనం ముందు గంగిరెద్దుల నృత్యం, గరగ నృత్య ప్రదర్శన, బుట్టబొమ్మలు, కాళికామాతల స్వరూపాలు, తీన్‌మార్ డప్పులు, బ్యాండ్ మేళాలతో అమ్మవారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వాహనంపై ఉంచి ఊరేగించడానికి పంచాయతీ వార్డు సభ్యుడు తంగెళ్ల సుబ్రహమణ్యం రూ.1.50 లక్షలకు వేలం పాటలో పాడుకున్నారు.

వచ్చే ఏడాది డిసెంబర్‌కు ఆర్వోబీ

నిర్మాణ పనులు పరిశీలించిన మంత్రి దుర్గేష్



ఆర్వోబీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు: పట్టణంలోని గూడెం రైల్వే గేట్ వద్ద జరుగుతున్న ఆర్వోబీ నిర్మాణ పనులను శనివారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పరిశీలించారు. పనుల వివరాలను అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ 2025 డిసెంబర్ నాటికి ఆర్వోబీని పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతానికి 20 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. కెనాల్ నుంచి రైతులకు నీటిని అందించడం వల్ల పనులు ఆలస్యం అవుతున్నాయన్నారు. ఇరిగేషన్, ఆర్ అండ్ బీ శాఖల అధికారులు కలసి నవంబర్ మొదటి వారంలో రైతులతో చర్చించి కాలువలకు నీటిని ఎప్పుడు నిలుపుదల చేయాలో నిర్ణయించుకోవాలన్నారు. నీటి విడుదలను నిలిపి వేసిన తర్వాత నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. వ్యాపారులకు ఇబ్బంది లేకుండా సర్వీసు రోడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఈఈ జి.రూప్‌కుమార్, డీఈ బీవీ రమణ, ఏఈ ఎం. శ్రీనివాస్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు మండల స్థాయిలోనే పరిష్కారం

జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

కొవ్వూరు: రెవెన్యూ సమస్యలను మండల స్థాయిలోనే ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్నరాముడు సూచించారు. రెవెన్యూ సమస్యలపై డివిజన్‌స్థాయిలో శనివారం సాయంత్రం ఆర్డీవో కార్యాలయంలో ఆయన సమీక్ష జరిపారు. భూసేకరణ సమస్యలు, నీటితీరువా వసూలు, రెవెన్యూ పరమైన ఇతర సమస్యలు, పీజీఆర్ఎస్‌లపై ఆయన సమీక్షించారు. మండల స్థాయిలోనే తహసీల్దార్ ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈ నెల 23న జిల్లా కలెక్టర్‌తో నిర్వహించే జిల్లా సమీక్ష సమావేశానికి మండల అధికారులంతా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆర్డీవో రాణి సుస్మిత, కార్యాలయ ఏవో జీఎస్ఎస్ జవహర్ బాజీ, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు పాల్గొన్నారు.

మొక్కలు నరికేశారంటూ ఇద్దరిపై కేసు

కొవ్వూరు: మరొకరి స్వాధీనంలో ఉన్న పొలంలోని జీడిమామిడి మొక్కలను నరికి వేశారని అందిన ఫిర్యాదు మేరకు మండలంలోని దేచెర్ల గ్రామానికి విప్పర్తి సుబ్బలక్ష్మి, విప్పర్తి రాంబాబులపై శనివారం కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. వారిద్దరూ గత నెల 24వ తేదీ తెల్లవారుజామున తన పొలంలోని జీడిమామిడి మొక్కలను నరికివేసి, తనకు ఆర్థికంగా నష్టం కలిగించినట్టు అదే గ్రామానికి చెందిన కస్సె వనితేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందడంతో పొలానికి వెళ్లి అడ్డుకునేందుకు ప్రయత్నించిన తనను వారిద్దరూ భయభ్రాంతులకు గురి చేసినట్టు వనితేశ్వరి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో వారిద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

క్షయ రోగులు పౌష్టికాహారం తీసుకోవాలి

నిడదవోలు: క్షయ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా మందులు వాడాలని జిల్లా టీబీ, లెప్రసీ నివారణ అధికారి డాక్టర్ ఎన్. వసుంధర సూచించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిని, ఎన్టీఆర్ అర్బన్ హెల్త్ అండ్ వెల్త్ సెంటర్‌ను శనివారం ఆమె సందర్శించారు. ఆసుపత్రుల్లోని రికార్డులు పరిశీలించారు. లెప్రసీ, టీబీ వ్యాధిగ్రస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాధిగ్రస్తుల ఇళ్లకు వెళ్ళి వారు మందులు వాడుతున్న విధానాన్ని, ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషకాహారం కోసం టీబీ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొనేలా దాతలను ప్రోత్సహించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డీపీఎంవో మోషే, ఎస్టీఎస్ ఎస్. పోతురాజు, ఆశాజ్యోతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు గురుకుల బాలికలు



జాతీయ స్థాయి క్రీడా పోటీలకు బాలికలతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

గోపాలపురం: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు పలువురు జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికై నట్టు ప్రిన్సిపాల్ టి.ఉమాదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్‌లో కర్నూలులో నిర్వహించిన అండర్-14,17,19 విభాగాల్లో ఎస్‌జీఎఫ్ మండల, నియోజకవర్గ, రాష్ట్రస్థాయి పోటీల్లో గురుకుల పాఠశాల విద్యార్థినులు పాల్గొనిసత్తా చాటారు. ఈ క్రమంలో వారు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ చెప్పారు. ప్రవల్లిక 400 మీటర్ల రన్నింగ్ పోటీలకు, కె.మంజుల 800 మీటర్ల రన్నింగ్ పోటీలకు, రేష్మ 3 కే రన్‌కు ఎంపికయ్యారు. అలాగే లాంగ్‌జంప్‌కు రమ్యశ్రీ ,వాలీబాల్‌కు భవానీ, లావణ్య, బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలకు తులసి, గీతక ఎంపికయ్యారు. ఇక రాష్ట్రస్థాయి ఖోఖో,కబడ్డీ జట్లకు రోజా దీపిక, బాల్ బ్యాడ్మింటన్ జట్లకు మానస, భవానీలు ఎంపికైనట్టు వివరించారు. ఎంపికైన విద్యార్థినులను, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ శిరీష, పీఈటీ గౌతమిలను ప్రిన్సిపాల్ ఉమాదేవి అభినందించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు దుద్దుకూరు విద్యార్థులు



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన దుద్దుకూరు హైస్కూల్ విద్యార్థులు

దేవరపల్లి: అండర్– 14, అండర్– 17 విభాగాల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని దుద్దుకూరు రంగరాయ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఏలూరులోని అల్లూరి సీతారామరాజు ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాస్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల అండర్– 17 విభాగంలో సీహెచ్ హనీ, పి.దినేష్ కార్తిక్, ఎస్‌కే ఉస్మాన్ గనీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. అలాగే అండర్– 14 విభాగంలో పి.హనీ, పి.నవీన్ జిల్లా జట్టుకు ఎంపికైనట్టు ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కోడి రామకుమార్ శుక్రవారం తెలిపారు. రాష్ట్రస్థాయి అండర్– 17 వాలీబాల్ పోటీలు ఈ నెల 21,22,23 తేదీల్లో అనంతపురం జిల్లా హిందూపురంలోను, రాష్ట్రస్థాయి అండర్ –14 వాలీబాల్ పోటీలు నవంబరు 9,10,11 తేదీల్లో విజయనగరం జిల్లా భోగాపురంలోనూ జరుగుతాయన్నారు. ఎంపికైన తమ పాఠశాల విద్యార్థులు రెండు విభాగాల్లోనూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

కోళ్లఫారాల నిర్వాహకులపై తహసీల్దార్ ఆగ్రహం



కానూరు పంచాయతీలో విచారణకు హాజరైన వారు

పెరవలి: జనావాసాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా కోళ్లఫారాలు నిర్వహిస్తున్న యజమానులు ఇరుగు పొరుగు వారికి ఇబ్బందులు కలగకుండా రక్షణ చర్యలు తీసుకోకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ డి.అచ్యుతకుమారి హెచ్చరించారు. మండలంలోని కానూరు, నడుపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న కోళ్ల ఫారాలను శనివారం ఆమె జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కలసి సందర్శించారు. కోళ్ల ఫారాల నుంచి వస్తున్న ఇబ్బందులను నియంత్రించాలంటూ ఇరుగు, పొరుగు వారు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో, కలెక్టర్ ఆదేశాల మేరకు వారు తనిఖీకి వచ్చారు. ఈ సందర్భంగా కోళ్ల ఫారాల యజమానులు, ఫిర్యాదుదారులతో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. అనంతరం అధికారులు కోళ్లఫారాలను పరిశీలించి, తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత నెలల్లో తాము పరిశీలించినపుడు పరిస్థితి ఏ విధంగా ఉందో ఇప్పుడు కూడా అలాగే ఉందంటూ తహసీల్దార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాలు తగ్గిన వెంటనే రక్షణ చర్యలు తీసుకుంటామని వాటి యజమానులు బదులిచ్చినప్పటికీ తహసీల్దార్ అంగీకరించలేదు. గతంలోనూ ఇదే మాట చెప్పారు, చిన్న మార్పు కూడాలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత

కొవ్వూరు: ఆడపిల్లలను చదివించడంతో పాటు సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మహిళ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో శనివారం బేటీ బచావో-బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడ పిల్లల చదువును ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. పలువురు గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు.ఐసీడీఎస్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఇటీవల బేటీ పఢావో -బేటీ బచావో కార్యక్రమంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

చాగల్లు: పల్లె పండుగలో భాగంగా పలు గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం భూమి పూజ చేశారు. పలు సమస్యలను పరిష్కరించాలంటూ ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. చాగల్లు అశోక్ నగర్ ఏరియాలో ఇంటర్నల్ సీసీ రోడ్డుకు, మీనానగరంలో సీసీ రోడ్డుకు, నెలటూరులో సీసీ రోడ్డు కండ్రైన్‌కు, ఊనగట్లలో సీసీ రోడ్డుకు, బ్రాహ్మణగూడెం వెంకటేశ్వర స్వామి కాలనీలో సీసీ రోడ్డుకు, చంద్రవరం, మల్లవరాల్లో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, తహసీల్దార్ ఎం.మెరికమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ, అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్ బీ ఏఈ అత్యుత్సాహం



రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ కారు డోర్ తీస్తున్న నిడదవోలు ఆర్ అండ్ బీ ఏఈ శ్రీనివాస విజయ్

నిడదవోలు: ఆర్ అండ్ బీ నిడదవోలు ఏఈ ఎం.శ్రీనివాస్ విజయ్ అత్యుత్సాహం ప్రదర్శించారు. పట్టణంలోని ఆర్వోబీ నిర్మాణ పనులను శనివారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పరిశీలించారు. మంత్రి కారు ఆగిన వెంటనే ఏఈ శ్రీనివాస విజయ్ స్వయంగా మంత్రి కారుడోర్ తీసి స్వామి భక్తిని ప్రదర్శించారు. సాధారణంగా మంత్రి భద్రతా సిబ్బంది దగ్గరుండి ఇలాంటి పనులు చూసుకుంటారు. ఇద్దరు గన్‌మెన్‌లు, నలుగురు సిబ్బందితో ఎస్కార్ట్, స్థానిక సీఐ, ఎస్సై, ఇతర పోలీసు సిబ్బంది మంత్రి భద్రతను పర్యవేక్షిస్తారు. వారే మంత్రి కారు డోర్ తీయడం, వేయడం కూడా వారే చూసుకుంటారు. అయితే ఆర్ అండ్ బీ ఏఈ శ్రీనివాస్‌విజయ్ మంత్రి కార్ డోర్ తీయడంతో అక్కడి వారంతా ఆశ్చర్యంగా చూశారు.

గోపాలపురం తహసీల్దార్‌గా విద్యాపతి



గోపాలపురం: స్థానిక తహసీల్దార్‌గా చదలవాడ విద్యాపతి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో కొవ్వూరు తహసీల్దార్‌గా పని చేసి సాధారణ బదిలీల్లో భాగంగా గోపాలపురం వచ్చారు. ఈయనను తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు కలసి పుష్ప గుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. రెవెన్యూ సమస్యలపై వెంటనే స్పందిస్తానని విద్యాపతి పేర్కొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులపై పర్యవేక్షణ ఉండాలి

నల్లజర్ల: ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వహణపై ప్రభుత్వ వైద్యుల పర్యవేక్షణ ఉండాలని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. నల్లజర్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిని శనివారం మధ్యాహ్నం ఆయన పరిశీలించారు. ఆ ఆసుపత్రిలోని ల్యాబ్, ఫార్మసీ, వార్డులు, ఐసీయూ, ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ వార్డులతో పాటు ఫైర్ సేఫ్టీ వ్యవస్థలను పరిశీలించారు. వైద్య సేవలపై పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా అధికారులు కుమార స్వామి, డాక్టర్ షమ్మీకుమార్, నల్లజర్ల వైద్యాధికారి డాక్టర్ గంగాధరరావు, సీహెచ్‌ఓ పలివెల ప్రసాద్ ఉన్నారు.

22 నుంచి ఆధార్ శిబిరాలు

చాగల్లు: గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకూ ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు తహసీల్దార్ మెరికమ్మ తెలిపారు. ఈ శిబిరాల్లో కొత్త ఆధార్ కార్డులు, ఆధార్ తీసుకుని పదేళ్లు దాటిన వారికి బయో మెట్రిక్ అప్‌డేట్, ఇంటి అడ్రస్, వయస్సు, పేరు మార్పు, ఫోన్ నంబర్ అప్డేట్, ఐదేళ్ల లోపు చిన్నారులకు బాల ఆధార్ కార్డులు జారీ వంటి సేవలను అందిస్తారని చెప్పారు.

కట్నం వేధింపులపై ముగ్గురిపై కేసు

కొవ్వూరు: మండలంలోని పశివేదల గ్రామానికి చెందిన కొల్లి రాజేష్‌పైన అతడి తల్లిదండ్రుల పైనా కొవ్వూరు రూరల్ పోలీసులు శనివారం కట్నం వేధింపుల కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన కొల్లి ఝాన్సీతో రాజేష్‌కు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వారి సంసారం కొంతకాలం సాఫీగానే సాగింది. మద్యానికి బానిసైన రాజేష్ అదనపు కట్నం కోసం భార్యను శారీరకంగా, మానసికంగా వేధించసాగాడు. దాంతో ఝాన్సీ ఈ ఏడాది మేలో ఈ విషయం తన తల్లిదండ్రులకు తెలిపింది. పెద్దల సమక్షంలో మాట్లాడి కాపురానికి పంపించారు. అయినప్పటికీ రాజేష్ ప్రవర్తనలో మార్పు రాలేదని ఝాన్సీ ఆరోపణ. తన భర్తకు అతడి తల్లిదండ్రులు రమేష్, రాజామణి సహకరిస్తున్నట్టు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు.